

టీచర్లకు బదిలీ కష్టాలు

టీచర్ల బదిలీపై కసరత్తులు జరుగుతున్నాయి. కొన్ని నిర్ణయాలపై టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. -10లో



టీడీపీ నాయకులకు భలే ఉపాధి

కావుగోదాయవలసలో ఫీల్డ్ అసిస్టెంట్ నకిలీ మస్టర్లు వేస్తున్నారు. పని చేయకుండానే వేతనాలు జమ చేస్తున్నారు. -10లో

న్యూస్‌రీల్

సజావుగా ఏపీ ఈఏపీసెట్



శివానీ కేంద్రంలో విద్యార్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్–2025 సజావుగా సాగుతోంది. ప్రస్తుతం ఎంపీసీ స్ట్రీం పరీక్షలు జరుగుతున్నాయి. చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్టులో 280 మందికి, 268, రెండో షిఫ్టులో 280 మందికి 266 మంది హాజరయ్యారు. ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో జరిగిన పరీక్షల్లో మొదటి షిఫ్టులో 170 మందికి 160, రెండో షిఫ్టులో 170 మందికి 163 మంది హాజరయ్యారు. ఈ నెల 27వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం శుక్రవారం ఉదయం ఆలయ అనివెటి మండపంలో ఘనంగా జరిగింది. వైశాఖ బహుళ ఏకాదశి సందర్భంగా శ్రీ ఉషా పద్మినీ ఛాయా సమేత సూర్యనారాయణ స్వామి కల్యాణమూర్తులకు ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణ ప్రక్రియను పూర్తి చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య ఈ కల్యాణాన్ని జరిపించారు.

యోగాతో శారీరక ఆరోగ్యం, మానసిక దృఢత్వం



80 అడుగుల రోడ్డులో యోగాసనాలు వేస్తూ..

శ్రీకాకుళంఅర్బన్: యోగాతోశారీరక ఆరోగ్యం, మానసిక దృఢత్వం లభిస్తుందని స్త్రీ, మహిళా శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు బగాది శాంతిశ్రీ అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో స్త్రీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యోగా శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఐసీడీఎస్ సిబ్బంది, చిల్డ్రన్ హోమ్స్‌కు చెందిన చిన్నారులు మొత్తం 700 మందికి పైగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ సమన్వయ అధికారి జగదీష్, నోడల్ అధికారి మనెమ్మ పాల్గొన్నారు.

రామ్.. సలామ్..!

నీ కీర్తి.. మాకు స్ఫూర్తి





మేజర్ రామ్

- కీర్తి చక్ర పురస్కారం అందుకున్న మేజర్ మళ్ల రామ్‌గోపాల నాయుడు
- సంబరపడుతున్న జిల్లా వాసులు
- అద్భుత సాహసంతో ఉగ్రవాదులను మట్టుబెట్టినందుకు పురస్కారం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/ సంతబొమ్మాళి:

సిక్కోలు సంబరపడింది. జిల్లాకు చెందిన మేజర్ మళ్ల రామ్‌గోపాలనాయుడు గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా దేశ రాజధానిలో 'కీర్తి చక్ర' అవార్డును అందుకున్నారు. ఈ క్షణాలు చూసి జిల్లా యావత్తు మురిసిపోయింది. ఈయన స్వగ్రామం సంతబొమ్మాళి మండలంలోని నగిరిపెంట గ్రామం. 2023 అక్టోబర్ 26న జరిగిన ఓ ఆపరేషన్‌లో మేజర్ రామ్ కీలకంగా వ్యవహరించారు. ఆ పోరాటాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందించారు. రామ్‌గోపాల నాయుడు తల్లిదండ్రులు నగిరి పెంటకు చెందిన రైతు మళ్ల అప్పలనాయుడు, హేమమాలిని. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివిన రామ్ 2012లో యూపీఎస్‌సీ నిర్వహించిన స్టాఫ్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఎగ్జామ్ రాసి పూణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీకి ఎంపికయ్యారు. అక్కడ మూడేళ్లు అభ్యసించి, 2015–16లో డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలటరీ అకాడమీలో క్యాడెట్‌గా చేరారు. అక్కడ శిక్షణ తీసుకున్న 900మందిలో గోల్డ్‌మెడలిస్ట్‌గా నిలిచి, ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. లెఫ్టినెంట్‌గా పనిచేసిన రెండేళ్లలో(2018)నే కెప్టెన్‌గా పదోన్నతి సాధించారు. అక్కడికి నాలుగేళ్లలో (2022)లో మేజర్‌గా ప్రమోషన్ లభించింది.

ఆ రోజు ఏం జరిగిందంటే..?

2023 అక్టోబర్ 26 ఉదయం 10.10గంటలకు ఐదుగురు ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడ్డారని ఓ జవాన్ ద్వారా తెలుసుకున్నారు. 10.25 గంటలకు రంగంలోకి దిగిన రామ్‌గోపాలనాయుడు తోటి జవాన్లకు మార్గనిర్దేశం చేసి, ఉగ్రవాదులను పట్టుకోవడానికి ప్రయత్నించారు. తన దళాలకు ప్రమాదాన్ని గ్రహించి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఒక ఉగ్రవాదిని హతమార్చారు. మరొక ఉగ్రవాదిని గాయపరిచినప్పటికీ ఆ ఉగ్రవాది భారీ కాల్పులు జరిపాడు. ఆ భీకర కాల్పుల మధ్య జవాన్లతో కలిసి ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఓ ఉగ్రవాది ఒక గుహలో దాగి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఆర్మీ బృందంపై గ్రెనేడ్ కూడా విసిరాడు. దాని నుంచి తప్పించుకుని భయపడకుండా ఆ ఉగ్రవాదిని పట్టుకుని హతమార్చారు. తన పోరాటంలో భాగంగా జవాన్లను కాపాడుకోవడం కోసం ధైర్యసాహసాలు ప్రదర్శించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు స్వీకరిస్తున్న మేజర్ రామ్‌గోపాల నాయుడు



దేశంలోనే గుర్తింపు వచ్చింది

ఆర్మీ మేజర్ రామ్‌గోపాల్ నాయుడు వల్ల దేశంలోనే మా గ్రామానికి గుర్తింపు వచ్చింది. ఉగ్రవాదులను అంతం చేయడంలో ధైర్య సాహసాలను ప్రదర్శించారు. కీర్తి చక్ర అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకోవడం మా అందరికీ గర్వంగా ఉంది. **– ఎం.రాజు, నగిరిపెంట గ్రామం, సంతబొమ్మాళి మండలం**

సంతోషంగా ఉంది




మా గ్రామానికి నిజమైన పండగ వచ్చింది. మేజర్ రామ్‌గోపాల్ నాయుడు వల్ల మా గ్రామానికి ప్రత్యేకత వచ్చింది. కీర్తి చక్ర అవార్డు అందుకోవడం మాకు సంతోషంగా ఉంది.
– ఎం.సోమేశ్వరరావు, నగిరిపెంట గ్రామం

స్ఫూర్తిగా తీసుకోవాలి..



మేజర్ రామ్‌గోపాల్ నాయుడును యువత స్ఫూర్తిగా తీసుకోవాలి. కీర్తి చక్ర అవార్డు అందుకున్న రామ్‌గోపాల్‌నాయుడు మన తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణం.
– ఉల్లాస లోకేశ్వరరావు, రిటైర్ నాయక్ సుబేదార్

మా కేశవుడు అంత పెద్దోడా..



- ఇప్పుడెలా ఉంటాడో.. కుటుంబ సభ్యుల ఎదురుచూపులు
- నంబాళ్ల కేశవరావు ఇంటికి ప్రజా సంఘాల తాకిడి
- మృతదేహం కోసం వెళ్లి వెనక్కి వచ్చేసిన కుటుంబ సభ్యులు
- కేంద్రం తీరును దుయ్యబడుతున్న ప్రజా సంఘాల నేతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: 'మావోడు అంత పెద్దోడా.. పోలీసు కాల్పుల్లో మరణించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా స్పందించారంటే అంత ఎత్తుకు ఎదిగిన నాయకుడా? పత్రికల్లో, టీవీల్లో చూస్తుంటే మా కేశవరావు స్థాయి ఏంటో తెలుస్తోంది. ఇక్కడ చదువుకున్నంత కాలం అందరితో సరదాగా ఉండేవాడు. రోజూ వ్యవసాయం చేసేవాడు. బాగా చదువుకునేవాడు. కబడ్డీ బాగా ఆడేవాడు. అలాంటి వ్యక్తి వరంగల్‌లో ఇంజినీరింగ్‌లో చేరాక.. ఏం జరిగిందో తెలియదు గాని నక్సలిజంలోకి వెళ్లిపోయాడు. దేశంలో ఉద్యమ శిఖరంగా, మావోయిస్టుల సుప్రీం కమాండర్‌గా, పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారంటే ఆశ్చర్యంగా ఉంది. 45 ఏళ్ల కిందట ఊరి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పుడెలా ఉంటాడో తెలియదు. పేపర్లలో ఫొటోలు చూసి ఈయనే కేశవరావా అనుకోవాల్సి వస్తోంది. మృతదేహం సొంతూరికి వస్తే తప్ప కేశవరావును కళ్లారా చూసే అవకాశం లేదు. చివరి చూపు లేకపోతే ఆయన ఎలా ఉంటాడో నేటికీ తెలుసుకోలేని పరిస్థితిలో మేమంతా ఉన్నాం.' **ఇదీ మావోయిస్టు అగ్రనేత నంబాళ్ల కేశవరావు స్వగ్రామం జియ్యన్నపేటలో వ్యక్తమవుతున్న అభిప్రాయం.**

ఈ గ్రామంలో కేశవరావుకు సంబంధించి దాదాపు 15 కుటుంబాలు ఉన్నాయి. ఆయన చిన్నతనంలో కలిసి తిరిగిన వ్యక్తులు ఉన్నారు. వరసకు సోదరుడైన నంబాళ్ల సూరయ్య, మరికొంతమంది వ్యక్తులు కేశవరావు బాల్యం గురించి చెబుతున్నారు. కష్టపడి వ్యవసాయం చేయడమే కాకుండా బాగా చదివేవాడని, కబడ్డీ మంచిగా ఆడేవాడని, ఈ మూడు తప్ప కేశవరావుకు ఇంకేమి తెలియవని, అలాంటి వ్యక్తి వరంగల్ వెళ్లాక ఉద్యమం బాట పట్టారని చెబుతున్నారు. తర్వాత గ్రామస్తులు, కుటుంబీకులు ఇబ్బంది పడకూడదని ఊరికి రాకపోయి ఉంటాడని అంటున్నారు. వీరంతా కేశవరావు బాల్యం కోసం చెబుతున్నారే తప్ప ఇప్పుడెలా ఉంటారో గుర్తించలేమంటున్నారు. ఆయన ఆనవాళ్లు ఎలా ఉంటాయో చెప్పలేమంటున్నారు. మరికొందరైతే 45 ఏళ్ల కిందట ఊరు వదిలి వెళ్లిపోయిన కేశవరావును తర్వాత ఎప్పుడూ చూడలేదని, విశాఖపట్నంలో జైలులో ఉన్నప్పుడు తన తండ్రితో పాటు కొందరు కలిశారని, ఉద్యమంలోకి వెళ్లొద్దని చెప్పినట్టు కూడా ప్రచారం ఉందని అంటున్నారు. మా కేశవరావు ఇప్పుడెలా ఉంటాడో చూడాలని ఉందని, చనిపోయాకైనా చూసిన భాగ్యం కలుగుతుందని అంటున్నారు. గతంలో కూడా రెండు మూడు పర్యాయాలు కేశవరావు చనిపోయారని వార్తలు వచ్చాయని, కానీ నిజం కాదని తర్వాత తర్వాత తెలిసిందని అంటున్నారు. ఇప్పుడే కంగా ప్రధానమంత్రి, హోంమంత్రి కేశవరావు చనిపోయాడని స్టేట్‌మెంట్ ఇచ్చారని, అసలేం జరిగిందో తెలియకపోయినా మృతదేహాన్ని ఇస్తే కళ్లారా చూసి, అంత్యక్రియలు చేసుకుంటామని అంటున్నారు. కాకపోతే, తమ పేర్లు రాయవద్దని గతంలో ఇలాగే మీడియాతో మాట్లాడితే విచారణకని విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తిప్పారని, ఇప్పుడు తమకు ఇదంతా అవసరమా అని అంటున్నారు. ప్రస్తుతానికైతే మృతదేహం కోసం గ్రామం ఎదురు చూస్తోంది.



కేశవరావు ఇంటికి ప్రజా సంఘాల తాకిడి

జియ్యన్నపేటలో తాళం వేసి ఉన్న కేశవరావు ఇంటికి ప్రజా సంఘాల తాకిడి ఎక్కువైంది. జిల్లా నుంచే కాదు మిగతా ప్రాంతాల నుంచి పలు సంఘాల నాయకులు వచ్చి చూస్తున్నారు. చుట్టు పక్కల ఉన్న వారితో మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా ప్రతినిధుల వద్ద భుక్తి కోసం, భూమి కోసం చేసిన పోరాటంలో శిఖరంగా కేశవరావు నిలిచాడని, దోపిడీ రూపం మార్చుకుందే తప్ప పూర్తిగా పోలేదని, చర్చలతో సమస్యలు పరిష్కరించుకుందామని మావోయిస్టులు కోరుతున్నా పట్టించుకోకుండా ఆపరేషన్ కగార్ పేరుతో హతమారుస్తుందని కేంద్ర ప్రభుత్వం తీరును దుయ్యబడుతున్నారు.

వెనక్కి వచ్చేసిన కుటుంబీకులు

కేశవరావు మరణించారని, వెళ్లి చూడొచ్చని జిల్లా పోలీసులే సమాచారమిచ్చారు. మృతదేహాన్ని తీసుకోవచ్చని చెప్పి పంపించారు. జగదల్‌పూర్ వరకు వెళ్లాక ప్రొసీజర్ అవ్వలేదని, ప్రస్తుతానికి మృతదేహం ఇవ్వడం కుదరదని అక్కడ పోలీసులు చెప్పేశారు. ఇంతలో పోస్టుమార్టమైతే అక్కడే ఖననం చేసేయండని, ఇక్కడికి తీసుకురావద్దని పోలీసులు చెప్పారంటూ అక్కడికి వెళ్లిన కేశవరావు సోదరుడు రామ్ ప్రసాద్ బృందం చెబుతోంది. మృతదేహాన్ని తీసుకొస్తే దేశం నలుమూలల నుంచి విప్లవ సంఘం నాయకులు, అభిమానులు వస్తారని, వారి ప్రభావం ఈ ప్రాంతంపై పడుతుందని, ఉద్యమాల పుట్టిన గడ్డపై మళ్లీ కొంత పుంతలు తొక్కుతుందేమో అన్న అనుమానంతో అడ్డుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పలాసలో ఉద్రిక్తత



కాశీబుగ్గ బస్టాండ్ వద్ద నిరసనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: నంబాళ్ల కేశవరావుతో పాటు 27 మంది మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపారని శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు పలువురు నిరసన తెలిపారు. కాశీబుగ్గలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం పది గంటలకు శాంతిపూర్వక నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాశీబుగ్గ సీఐలు సూర్యనారాయణ, తిరుపతిరావులు తమ సిబ్బంది వచ్చి వారిని అడ్డుకున్నారు. సుమారు 15 మందిని అదుపులోకి తీసుకుని కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో కాశీబుగ్గ బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కనిపించింది. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, లిబరేషన్ పార్టీ నాయకులు, పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు, అమరుల బంధుమిత్రుల సంఘం, ప్రజాకళామండలి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, సీపీఎం పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో నిరసన ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది.

అక్రమ నిర్మాణ స్థల పరిశీలన



అక్రమ నిర్మాణ స్థలాన్ని తనిఖీ చేస్తున్న కవిటి పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

కవిటి: 'సర్కారు వారి జాగాలో..' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. శుక్రవారం సంబంధిత అక్రమ నిర్మాణం జరుగుతున్న స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయంలో ఓ సమావేశానికి ఈఓ వీరభద్రస్వామి హాజరైన నేపథ్యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ భూపతి, సిబ్బంది సుదర్శన్, నూకరాజు నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. తదుపరి ఆదేశాలు వెలువడేంత వరకు ఎలాంటి నిర్మాణం చేసినా చట్టపరమైన కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని నిర్మాణదారుడిని హెచ్చరించారు. వీఆర్‌ఓ ఎస్.నారాయణ, వీఆర్‌ఏ కాళిదాస్‌లు సైతం నాలా కన్వర్షన్ సర్టిఫికెట్ చూపాలని కోరారు. పత్రం చూపిన తర్వాత ఇందులో ఆర్‌అండ్‌బీ స్థలం ఎంత, జిరాయితీ స్థలం ఎంత అనే అంశాలను లెక్కచూస్తామని తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని సూచించారు.

నైట్ పెట్రోలింగ్ విధుల్లో ఎక్సైజ్ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లావ్యాప్తంగా ఉన్న 176 మద్యం దుకాణాలు, 18 బార్ అండ్ రెస్టారెంట్లలో అక్రమాలకు తావులేకుండా పూర్తిస్థాయిలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిఘా పెట్టనుందని సంబంధిత శాఖ డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఉన్న 12 స్టేషన్ల పరిధిలో స్టేషన్ అధికారి, మరో ముగ్గురు కానిస్టేబుళ్లు రొటేషన్ పద్ధతిలో ప్రతిరోజూ నైట్ పెట్రోలింగ్ విధుల్లో పాల్గొనేలా కార్యాచరణ చేశామని శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. బార్ అండ్ రెస్టారెంట్ల వద్ద రాత్రి 9 నుంచి 11 గంటల వరకు, దుకాణాల వద్ద 8 నుంచి 10 గంటల వరకు ఈ విధులుంటాయన్నారు. ఎక్సైజ్ 'ఐ' అనే మొబైల్ అప్లికేషన్ కూడా త్వరలో వెబ్‌సైట్‌లో పెట్టనున్నామని తెలిపారు. ఎక్సైజ్ నేరాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులుంటే టోల్‌ఫ్రీ నంబర్ 14405 కి కాల్ చేసి తెలియజేయాలన్నారు.

సమన్వయంతో సాగుదాం.. సైనికుల్లా పనిచేద్దాం..



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు

సంపద సృష్టి అంటే అప్పు చేయడమేనా..?

- 11 నెలల బాబు పాలనలోనే రూ.1.40 లక్షల కోట్లు అప్పు
- అప్పు చేసి అమరావతికి పెడితే ప్రజలపై పెనుభారం
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు
- కూటమిది అరాచక పాలన అంటూ మండిపాటు
- సమష్టిగా పనిచేయాలని పార్టీశ్రేణులకు పిలుపు

శ్రీకాకుళం రూరల్:

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, రానున్న రోజుల్లో ప్రజలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు ధ్వజమెత్తా రు. జిల్లా కేంద్రంలోని పాత్రునివలస జాతీయ రహదారి వద్ద గల పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పగ్గాలు చేపట్టిన 11 నెలల్లోనే లక్షా నలభై వేల కోట్లు అప్పు చేశారని, ప్రపంచ బ్యాంకు నుంచి అప్పులు తెచ్చి అమరావతిలో పెడితే ప్రజలపై పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టించడం అంటే అప్పు చేయడమేనా అని సూటిగా ప్రశ్నించారు. ఆరు నెలల్లోనే కూటమి పాలనపై జనాల్లో అసంతృప్తి కనిపిస్తోందన్నారు. అధికారం స్వీకరించినపు డు రాజ్యాంగంపై ప్రమాణం చేసిన చంద్రబాబు ఇప్పుడు మాట తప్పుతున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ వర్గాలకు సంక్షేమ పథకాలు ఇవ్వకూడదని సాక్షాత్తు సీఎం బహిరంగ సభల్లో చెప్పడం సబబు కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 16 మంది ముఖ్యమంత్రుల హయాంలో కేవలం 58 ఏళ్లలో రూ.1.26 లక్షల కోట్లు అప్పు ఉంటే చంద్రబాబుహయాంలో మాత్రం అప్పు కుప్పలైందన్నారు. 2014–19లో చంద్రబాబు పరిపాలనలో రూ.2లక్షల 50వేల కోట్లు అప్పు చూపించారన్నారు.

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు 70 లక్షల ఎకరాలకు సాగునీరు అవసరం ఉంటుందని, పోలవరం నుంచి ఇక్కడకు సాగునీరు రాకుండా ఎత్తును తగ్గించే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో భాగంగా క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా ఎన్నికైన పాతపట్నం సమన్వయకర్త రెడ్డి శాంతికి పార్టీ కేడర్ అంతా అభినందలు తెలుపుతూ సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ కళింగ వైశ్య, తూర్పు కాపు కుల విభాగ రాష్ట్ర అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, ఎంపీపీ గొండు రఘురామ్, అంబటి శ్రీనివాస్‌రావు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎచ్చెర్ల శ్రీధర్, ఎం.స్వరూప్, గొండు కృష్ణ, జిల్లా పార్టీ గ్రీవెన్స్ విభాగపు అధ్యక్షుడు రౌతు శంకరావు, మార్పు పృథ్వీ, తమ్మినేని చిరంజీవినాగ్, చిట్టి జనార్దన రావు, మూకళ్ల తాతబాబు, గంగు నరేంద్ర, గుండ హరేష్, ముంజేటి కృష్ణ, ఎన్ని ధనుంజయ పాల్గొన్నారు.

టీడీపీ విఫలమైంది



2019–24లో జగన్ హయాంలో అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో ప్రజలకు తెలుసు. టీడీపీ పూర్తిగా విఫలమైంది. **– రెడ్డి శాంతి, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే**

హామీలు తుంగలోకి తొక్కారు



టీడీపీ ఏడాది పరిపాలనలో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కింది. రానున్న రోజుల్లో కూటమి పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారు. **– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్**

అభివృద్ధి గురించి చెప్పాలి



టీడీపీ అరాచకాలు బయట పెట్టాలంటే ప్రతి నియోజకవర్గంలో బహిరంగ సమావేశాలు ఏర్పాటు చేయాలి. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని చాటి చెప్పాలి. **– నర్తు రామారావు, ఎమ్మెల్సీ**

ప్రజలతోనే ముందుకు..



కూటమి ప్రభుత్వం తప్పులను ప్రజల్లోకి తీసుకెళదాం. ప్రజా సమస్యలపై పోరాడదాం. అందరం కలిసికట్టుగా పనిచేసి ముందుకు సాగుదాం.
–గొర్లె కిరణ్ కుమార్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే

మళ్లీ అధికారం సాధిద్దాం



సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. 50 ఏళ్లకు ఇస్తామన్న పెన్షన్ ఊసే లేదు. వైఎస్సార్ సీపీ వర్గాలన్నీ కలిసికట్టుగా పనిచేసి మళ్లీ అధికారం సాధించాలి.
– ధర్మాన కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు

జన హృదయాలు గెలిచేది జగన్ మాత్రమే..



కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుంది. పార్టీకి శక్తివంతంగా తీర్చిదిద్దాలంటే కార్యకర్తలు, నాయకుల సహకారం అవసరం. ప్రజల హృదయాలను గెలిచే నేత ఒక్క వైఎస్ జగన్ మాత్రమే. **– తమ్మినేని సీతారాం, పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త**

జూన్ 4న వెన్నుపోటు దినోత్సవం



జూన్ 4న వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నాం. అందులో భాగంగానే కలెక్టరేట్ వద్ద నిరసనలు చేస్తూ వినతి పత్రాలు అందిస్తూ ఈ ప్రభుత్వానికి సాగనంపాలి. అలాగే జూన్ 12న చీకటి రోజుగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపడుతూ గతంలో మనం చేసిన అభివృద్ధిని వివరిద్దాం.
– సీదిరి అప్పలరాజు, పార్టీ రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు

కుట్ర జరుగుతోంది



కూటమి ప్రభుత్వ నాయకుల మాటలు వింటే రక్తం మరిగిపోతుంది. రాష్ట్రంలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లేకుండా చేస్తామనడంలో ఏదో కుట్ర జరుగుతోంది.
– పేరాడ తిలక్, టెక్కలి సమన్వయకర్త

తేడా జనమే గమనించారు



పాలనలో చంద్రబాబు విఫలమయ్యారు. చంద్రబాబు 15 ఏళ్ల పాలనకు జగన్ ఐదేళ్ల పాలనకు తేడాను ప్రజలు గమనించారు. **– చింతాడ రవి, ఆమదాలవలస సమన్వయకర్త**

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత..



చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజల్ని బాగా మభ్యపెట్టారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పార్టీ బలోపేతమే ధ్యేయంగా పని చేద్దాం. **– కిల్లి వెంకట సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి**

టీడీపీ నాయకులకు భలే 'ఉపాధి'



కాపుగోదాయవలసలో ఉపాధి పని చేస్తున్న వేతనదారులు

సంతబొమ్మాళి: ఉపాధి హామీ పథకాన్ని టీడీపీ నాయకులు తమకు అనుకూలంగా మలుచుకుని జేబులు నింపుకుంటున్నారు. కాపుగోదాయవలస గ్రామంలో జరుగుతున్న తంతు గమనిస్తే అధికార పక్ష నేతల తెలివి అర్థమవుతుంది. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పనికి రాకుండానే స్థానిక టీడీపీ నాయకుల పేర్లు మస్టర్లలో నమోదు చేసి డబ్బులను దోచుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయ దొంగ మస్టర్లు వేస్తూ చేతివాటం చూపిస్తున్నాడు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుత్తమ శివప్రసాద్ (జాబ్ కార్డు నంబర్ 010220) ఉపాధి పనికి వెళ్లకుండానే 36 రోజుల పాటు ఆయన పేరిట మస్టర్‌ను నమోదు చేసి తొమ్మిదివేల రూపాయలు అకౌంట్‌లో వేసుకున్నారు. సైనా భీష్మారావు, అతని భార్య ఈశ్వరమ్మ (జాబ్ కార్డు నెంబర్ 010153) పేరున కలిపి సుమారు 72 రోజులు మస్టర్లు నమోదు చేసి సుమారు రూ.18వేలు లాగేశారు. దున్న చంద్రయ్య, అతని భార్య నరసమ్మ (010122) పేరున 42 రోజులు మస్టర్లు నమోదు చేసి సుమారు రూ. 14వేలు వారి ఖాతాలో జమ చేసుకున్నారు. వాడరేవు తారకేశ్వరరావు (జాబ్ కార్డు నంబర్ 10313), కారాడ ప్రభ (జాబ్‌కార్డు నంబర్ 010262) పేరున మస్టర్లు నమోదు చేసి వారి అకౌంట్లోనూ డబ్బులు వేసుకున్నారు. టీడీపీ నాయకుడు కుత్తమ శివప్రసాద్ అక్క సైనా ఉమాదేవికి (జాబ్ కార్డు నంబర్ 010174) సుమారు 70 ఏళ్లు ఉంటాయి. ఆమె కిడ్నీ పేషెంట్. అయినా ఆమె పేరున కూడా 36 రోజులు మస్టర్లు నమోదు చేసి తొమ్మిది వేలు పైచిలుకు డ్రా చేశారు. ఇలా టీడీపీ నాయకులు, వారి కుటుంబ సభ్యుల పేర్లతోనే కాకుండా వలస వెళ్లిన వారు, విదేశాల్లో ఉన్న వారి పేర్లతో కూడా మస్టర్లు నమోదు చేస్తున్నారని ఉపాధి వేతన దారులు ఆరోపిస్తున్నారు. చింతల ట్యాంక్, చింతలచెరువు, జగన్నాథసాగరం, యర్రా ట్యాంక్ చెరువుల్లో పనిచేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయ నమోదు చేశారు. నిరుపేదలకు వెళ్లాల్సిన డబ్బులు ఇలా టీడీపీ నాయ కులు వారి బంధువుల ఖాతాల్లోకి వెళ్లడంపై వేతన దారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తప్పవు

ఉపాధి పనికి వెళ్లని వారి పేరిట బినామీ మస్టర్లు నమోదు చేయకూడదు. విచారణ చేపట్టి వాస్తవమని తెలితే చర్యలు తప్పవు.

– శైలజ, డ్వామా ఏపీడీ, టెక్కలి

రెడీగా భవనాలు..
అయినా మీనమేషాలు



రిమ్స్ కాలేజీ హాస్టల్ భవనాలు

- పూర్తయిన భవనాలు స్వాధీనం చేసుకోని రిమ్స్ అధికారులు
- వసతికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- క్యాంటీన్ లేక అవస్థలు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో పలు భవన నిర్మాణాలు పూర్తయినా సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకోవడం లేదు. 200 మందికి సరిపడా హాస్టల్ భవనం నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర అవుతున్నా రిమ్స్ అధికారులు ఇప్పటికీ భవనాన్ని స్వాధీనం చేసుకోలేదు. ఏపీ హెచ్‌ఎంహెచ్‌ఐడీసీ అధికారులు ఎన్ని సార్లు లేఖలు రాసినప్పటికీ వసతి గృహ నిర్వహణకు అవసరమైన సామగ్రి లేదని తిరుగు టపాలో రిమ్స్ అధికారులు లేఖలు రాస్తున్నారు. ఈ భవనాలను ఇలాగే వదిలేయటంతో మరుగుదొడ్లు, వాష్ బేసిన్ల వద్ద బిగించి ఉన్న 300కు పైగా కుళాయిలు చోరీకి గురయ్యాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ లబోదిబోమంటూ భవనాన్ని స్వాధీనం చేసుకునే సమయంలో కుళాయిలను మరోసారి అమర్చుతానని తెలిపారు. రిమ్స్‌లో ఎంబీబీఎస్ విద్యార్థులు 650 మంది, పీజీ విద్యార్థులు 650 మంది, హౌస్ సర్జన్‌లు 150 మంది వరకు ఉన్నారు. వీరికి సరైన వసతి సౌకర్యం లేకపోవటం వల్ల 275 మంది ప్రైవేటుగా అద్దె గదుల్లో ఉంటూ చదువుతున్నారు. 275 మందిలో 117 మంది మహిళలు కాగా 158 మంది పురుషులు ఉన్నారు. పీజీ విద్యార్థుల సంఖ్య 180 మంది కాగా వీరిలో 115 మంది ప్రైవేటుగా అద్దె భవనాల్లో ఉండి చదువుతున్నారు. వసతి గృహాల్లో ఉన్నవారు కూడా ఒక్కో గదిలో 5 నుంచి 10 మంది వరకు ఉండి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇవేమీ రిమ్స్ అధికారులకు పట్టడం లేదు.

క్యాంటీన్‌దీ ఇదే పరిస్థితి..

రిమ్స్ ఆవరణలో క్యాంటీన్ భవన నిర్మాణం కూడా పూర్తయి నాలుగు నెలలకు పై బడుతుంది. దీన్ని కూడా రిమ్స్ అధికారులు స్వాధీనం చేసుకోలేదు. ఎవరికి వారు తమకెందుకులే అనే పద్ధతిలో ఉన్నారు. హాస్టల్స్‌లో భోజనాలు సరిగా లేవన్న పంచాయతీ కలెక్టర్ వరకు వెళ్లిన విషయం పాఠకులకు తెలిసినదే. కనీసం క్యాంటీన్ ఉన్నా అక్కడైనా భోజనం చేసుకుంటామని విద్యార్థులు భావిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రిమ్స్‌లో ఉన్న సమస్యలు అన్ని వర్గాల వారి నుంచి తెలుసుకుంటున్నాను. ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తాను.

– డాక్టర్ అమూల్య, సూపరింటెండెంట్, రిమ్స్ ఆస్పత్రి, శ్రీకాకుళం

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

రిమ్స్ అధికారులు కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఇటీవలి రిమ్స్‌లో పర్యటించిన కలెక్టర్ తాగునీటి ఆర్వో ప్లాంట్, లిఫ్టులు పనిచేయకపోవటాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. ఈ విషయాలను తనకు ఎందుకు తెలియజేయలేదని అధికారులపై మండిపడ్డారు. మరమ్మతులు చేపట్టాలని సూచించి రెండు నెలలు దాటుతున్నా పట్టించుకోలేదు. సలహా మండలి సమావేశాలు కూడా నిర్వహించటం లేదు. ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

క్లుప్తంగా

25న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని రాజాంలో ఈనెల 25వ తేదీన జరిగే ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలను విజయంతం చేయాలని ఆలిండియా చెస్ ఇన్‌స్కూల్ ట్రైనర్ సనపల భీమారావు కోరారు. రాజాంలోని జీఎంఆర్ ఐటీ కాలేజ్ వేదికగా పోటీలు జరుగుతాయన్నారు. కళాశాల ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, మీట్ కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ బి.అరుణ్‌కుమార్ పోటీలకు సంబంధించి దగ్గరుండి ఏర్పాట్లను కల్పిస్తున్నట్టు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ. 1,30,000 నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్టు చెప్పారు. వివరాలకు 99125 59735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సదరం.. అవస్థలు పదిలం



నరసన్నపేట ఆస్పత్రిలో ఆరు బయటే ఉన్న దివ్యాంగులు



ఆమదాలవలస మండలం వంజంగి నుంచి వచ్చిన బెండి సూర్యనారాయణ

నరసన్నపేట: దివ్యాంగ పింఛన్ల ఏరివేతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో సదరం పరిశీలన కొనసాగుతోంది. నాలుగు నెలల క్రితం సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించారు. ఇప్పటి వరకు నరసన్నపేట, పోలాకి, జలుమూరు, ఆమదాలవలస మండలాలకు చెందిన దివ్యాంగుల సర్టిఫికెట్లు పరిశీలించారు. శుక్రవారం నుంచి సారవకోట మండలానికి చెందిన దివ్యాంగుల పత్రాల పరిశీలన ప్రారంభమైంది. సుదూరమైనా నరసన్నపేట ఆస్పత్రికే వెళ్లాలని చెబుతుండడంతో దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. పరిశీలన కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు ఉండటం లేదని వాపోతున్నారు. ఒక్కో రోజు సర్వర్ డౌన్ అవుతుండటంతో మళ్లీ మరుసటి రోజు రావాల్సి వస్తుందని అంటున్నారు. సిబ్బందికి కూడా భోజన సదుపాయాలు సైతం కల్పించడం లేదు.



ఆమదాలవలస మండలం నుంచి వచ్చిన భారతి



జలుమూరు మండలం కరకవలస నుంచి వచ్చిన బొంగు లక్ష్మీనారాయణ

కొత్తూరు తహసీల్దార్‌పై జేసీకి ఫిర్యాదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్తూరు మండలం జగన్నాథపురంలో లిమ్మక దేవి అనే దళిత మహిళను కొత్తూరు తహసీల్దార్ వేధిస్తున్నారని, తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు శుక్రవారం విన్నవించారు. జగన్నాథపురానికి చెందిన లిమ్మక దేవి సాగులో ఉన్న భూమికి అన్ని ఆధారాలు ఉన్నా సాగు చేయవద్దని చెబుతున్నారని, కాదని వెళితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు. పెత్తందారులకు తహసీల్దార్ కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, రెల్లికుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు గొల్లపల్లి నందేశ్, మాలమహానాడు జిల్లా నాయకులు సూర్యనారాయణ, అంబేడ్కర్ చైర్ సాధన సమితి జిల్లా కన్వీనర్ టొంపల రవణ తదితరులు జేసీకి వినతి పత్రం ఇచ్చారు.

'తెలుగుభాషకు వెన్నుపోటు పొడుస్తారా..?'

శ్రీకాకుళం న్యూకాలనీ: తెలుగు భాషకు వెన్నుపోటుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. సర్కారు పాఠశాలల్లో తెలుగు మీడియంను రద్దు చేస్తుండటం, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టు బోధనకు ఉపాధ్యాయుల కేటాయింపు లేకపోవడంపై భాషోపాధ్యాయులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలను అందజేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగుభాషా బోధనకు ఉపాధ్యాయులు లేకుండా చేస్తూ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు వెలువరించడం బాధాకరమని, ఇది ఎంతమాత్రం ప్రభుత్వానికి తగదని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్ఎల్‌టీఏ) శ్రీకాకుళం జిల్లా శాఖ నాయకులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు నేతృత్వంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడును కలిసి విన్నవించారు. రాష్ట్రవ్యాప్తంగా 2001 నుంచి విస్తృతంగా ప్రాథమికోన్నత పాఠశాలలు నెలకొల్పిన నాటి నుంచి 2025 వరకు సబ్జెక్ట్ టీచర్లకు కొరత లేకుండా బోధన జరిగిందని వారు కేంద్రమంత్రికి వివరించారు. కానీ ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ తాజాగా జారీ చేసిన రేషనైలేజేషన్ జీఓలో ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడి పోస్టును లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పాఠశాల విద్యాశాఖ తీసుకొచ్చిన హేతుబద్ధీకరణ జీఓలో మార్పులు చేసి, ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు పోస్టును పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇవే సమస్యలను ప్రస్తావిస్తు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. ప్రజాప్రతినిధులను కలిసినవారిలో వసంత్,రంగనాయకులతోపాటు గొడబ మేరీప్రసాద్, చింతపల్లి జనార్దనరావు, మజ్జి వెంకటరమణ, అరసవిల్లి గణపతిరావు, మజ్జి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీ కష్టాలు



శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు విద్యాశాఖ సమాయత్తమైంది. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీఓ నంబర్ 22తో షెడ్యూల్‌తోపాటు, మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల వ్యవధిలోనే జరుగుతున్న ఈ బదిలీలకు సంబంధించి దరఖాస్తులు చేసుకునే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు.

ఒకేచోట 8 ఏళ్లు పనిచేస్తే తప్పనిసరి బదిలీ..

ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు 5 ఏళ్లు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు ఇతర కేటగిరీ టీచర్లు 8 ఏళ్ల పాటు ఒకే స్టేషన్ (ఒకే పాఠశాల)లో పని చేస్తూ ఉంటే.. కచ్చితంగా బదిలీ కావాల్సి ఉంది. అలాగే రిక్వెస్ట్ బదిలీ కోసం సైతం దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివిధ ఉన్నత చదువులు (పీజీ, బీఈడీ, ఎంఈడీ, ఎంఫిల్‌లు, పీహెచ్‌డీలు) పేరిట స్టడీ లీవ్ పేరుతో సెలవుల్లో ఉన్న ఉపాధ్యాయులు(ఆగస్టులోపు) 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటే బదిలీ కానున్నారు.

బదిలీల కోసం 4198 పోస్టులు సిద్ధం..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రెగ్యులర్ టీచర్లు 12,121 మంది, మినిమమ్ టైం స్కేల్ టీచర్లు 364 మంది పని చేస్తున్నారు. జిల్లాలో డీఎస్సీ–2025 ద్వారా 458 మంది టీచర్లను భర్తీ చేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చారు. బదిలీలకు ఉమ్మడి జిల్లాలో 4198 పోస్టులను ఖాళీగా విద్యాశాఖ చూపిస్తోంది. ఇందులో క్లియర్ వెకేన్సీలు 567, 8/5 అకడమిక్ ఈయర్స్ పూర్తి చేసుకున్నవారు 2,092 మంది ఉన్నారు. ఫారిన్ సర్వీసు టీచర్లు ఏడుగురు ఉన్నారు. పునర్‌వ్యవస్థీకరణ ద్వారా ఖాళీలు (రీ–అపోర్షిమెంట్ ఖాళీలు) 1,521, స్టడీలీవ్‌లో 10 మంది టీచర్లు ఇలా మొత్తం అన్నీ కలిపి 4198 పోస్టులను ఖాళీలు పాఠశాల విద్యాశాఖ చూపించింది.

ఎన్నో సందేహాలు..

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో జరిపిన చర్చల ప్రకారం ఇవ్వాల్సిన బదిలీ మార్గదర్శకాల్లో అనేక అంశాలపై స్పష్టత లోపించిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.
- సర్వర్ డౌన్‌లో ఉంటుండటంతో ఆన్‌లైన్ చేయడంలో తీవ్రజాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.
- ఇంగ్లిష్ మీడియంతో సమానంగా తెలుగు మీడియంను నిర్వహించాలన్న అంశంపై స్పష్టత లేదు.
- మిగులు స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలన్న అంశంపై స్పష్టత లేదు.
- ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు పోస్టులు కొనసాగింపుపై స్పష్టత లేదు. ఆన్‌లైన్‌లో చూపించడంలేదు.
- ఎస్జీటీలతోపాటు హెచ్‌ఎంలు, ఎస్‌ఏలకు మాన్యువల్‌గా కౌన్సిలింగ్ జరపాలన్నదానిపై స్పష్టత లేదు.
- ఖాళీలను బ్లాక్ చేయకుండా ఉంచాలని, స్టడీ లీవ్ ఖాళీల విషయంలో ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.
- ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం (పీఎస్‌హెచ్‌ఎం) పోస్టులను ఎస్జీటీలతోనే భర్తీ చేయాలన్న డిమాండ్‌పై స్పష్టత లేదు.

పారదర్శకంగా చేస్తాం..



ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా జరిపించేలా కసరత్తులు చేస్తున్నాం. వివిధ ఖాళీల జాబితాలను రూపొందించాం. హెచ్‌ఎంలు, ఎస్జీటీలు, ఎస్‌ఏల ఖాళీలను ప్రదర్శిస్తాం. ఎస్‌ఏల బదిలీలు ఆన్‌లైన్‌లో చేపట్టనున్నాం. ఎస్జీటీలకు సంబంధించి మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉంది. బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్లు 9703148269, 8143142450, 9000907101ను సంప్రదించవచ్చు.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

తప్పిన పెనుప్రమాదం



వాంద్రంగి వంతెనపై ప్రమాదానికి గురైన కారు

జి.సిగడాం: వాంద్రంగి రైల్వే వంతెనపై అతివేగంతో వస్తున్న కారు ట్రాక్టర్‌ను ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జైపోయింది. స్థానిక ఎస్ఐ వై.మధుసూదనరావు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాగోలు సమీపంలో ఉన్న గూడెం గ్రామం నుంచి రాకేష్ అనే వ్యక్తి కారుతో రాజాం వైపు వెళ్తున్నాడు. రైల్వే వంతెనపై ముందు ఉన్న టాక్టర్‌ను ఢీ కొట్టడంతో కారు ముందు భాగం ధ్వంసమైపోయింది. రాకేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. 108 సాయంతో ఆయనను పొందూరు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తాళ్లవలస పంచాయతీ బొడ్డపాడు గ్రామంలో కాలారి నారాయణరావుకు చెందిన సుమారు రూ. 80 వేలు విలువ చేసే చూడి ఆవు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. వ్యవసాయ మోటారుకు వెళ్లే విద్యుత్ లైన్ ట్రాన్స్‌ఫార్మర్ గ్రామం మధ్యలో కిందకు ఉండడం వల్ల ఆవుకు విద్యుత్ షాక్ కొట్టిందని గ్రామస్తులు చెబుతున్నారు.

విషం తాగి యువకుడు మృతి

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం పంచాయతీలో గల లోచర్లపాలెం గ్రామానికి చెందిన సింక శ్యామలరావు(29) విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జేఆర్‌పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శ్యామలరావు గురువారం సాయంత్రం లోచర్లపాలెం గ్రామ సమీపంలో విషం తాగేశాడు. అపస్మారక స్థితికి వెళ్లిపోవడంతో స్థానికులు కొండములగాం ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని అన్నయ్య వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఫుడ్ పాయిజన్‌తో రెండు గేదెలు మృతి



మృత్యువాత పడిన ముర్రాజాతి గేదె వద్ద రైతు బెండాళం గణపతి

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామానికి చెందిన బెందాళం గణపతి అనే రైతుకు చెందిన రెండు ముర్రా జాతి గేదెలు శుక్రవారం ఉదయం హఠాత్తుగా మృతిచెందాయి. ఎప్పటిలాగే ఉదయం ఆహారంగా పాలిష్ తౌడు కలిపి పెట్టారు. ఆహారాన్ని తింటూ అనారోగ్యానికి గురయ్యాయి. దీంతో అప్పటికప్పుడే మృతిచెందినట్లు రైతు గణపతి వాపోయాడు. రోజుకు 5 లీటర్లు చొప్పున పాలు ఇచ్చేవని రైతు తెలిపాడు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. శ్రీకాకుళం వైపు వెళుతున్న ఆటో ప్రయాణికులను ఎక్కిస్తుండగా వెనుక నుంచి మరో ఆటో వచ్చి ఢీకొట్టింది. దీంతో ఢీ కొట్టిన ఆటో బోల్తా పడగా.. ముందు ఉన్న బండి ఓ వైపునకు ఒరిగిపోయింది. రెండు ఆటోల్లో పది మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. వారిలో లక్ష్మమ్మ, భాగ్యవతి, అమ్మన్నమ్మ, శోభామణి గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన వారిది పొందూరు మండలం తాడివలస గ్రామం.



పాత జాతీయ రహదారిపై జరిగిన ప్రమాద దృశ్యం